

## తాతయ్య స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్

**హీరో** మోటార్స్ గురించి తెలియనివారు ఉండరు. బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్ స్థాపించిన ఈ కంపెనీ ఆటోమొబైల్ రంగంలో పెను సంచలనం. బ్రిజ్‌మోహన్ తనయుడు పవన్ ముంజాల్ తన సమర్థతతో మరింత లాభాల బాట పట్టించారు. ఆయన కూతురు వసుధ కూడా పెద్దల మార్గంలోనే కంపెనీలోకి వచ్చేస్తుంది అనుకున్నారంతా. కానీ, ఆటోమొబైల్ రంగం వడ్డించిన విస్తరి కాదని భావించింది. సొంతంగా మరో వ్యాపారం చేయాలనుకుంది. ఇష్టంగా చాక్లెట్ల బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. ఇదేమంత తేలికగా జరగలేదు. మార్కెట్ గురించీ, వినియోగదారుల అభిరుచి గురించీ చాలా విశ్లేషణ జరిగాకే Choko la అనే కంపెనీని స్థాపించింది. నాణ్యత కలిగిన చాక్లెట్లు, చాక్లెట్ పానీయాలు అందిస్తూ మార్కెట్లో నిలదొక్కుకుంది. తనకు తాత నుంచి కొంత, తండ్రి నుంచి కొంత వ్యాపార నైపుణ్యం అలవడిందని చెబుతుంది వసుధ. కంపెనీలోని ప్రతి ఉద్యోగికి తాతయ్య అందుబాటులో ఉండేవారనీ, వారి కష్టసుఖాలు గమనించుకునేవారనీ గుర్తుచేసుకుంటుంది. పోటీదారుల గురించి ఎప్పుడూ ఆలోచించవద్దనీ, నీకు నువ్వే పోటీ అనే విషయాన్ని మర్చిపోవద్దనీ బ్రిజ్‌మోహన్ జీ చెప్పిన మాటనే అనుసరిస్తూ... వైవిధ్యమైన రంగంలో దూసుకుపోతున్నది వసుధ.

నమస్తే తెలంగాణ

# జిందగీ II

హైదరాబాద్ | శనివారం 24 ఫిబ్రవరి 2024 www.ntnews.com

Fashion

## మట్టి వన్నెలు..

**ప్ర**కృతికి దగ్గరగా ఉండే వన్నెలు కళ్లకు హాయినీ, మనసుకు ప్రశాంతతనూ కలిగిస్తాయి. అలాంటి మట్టి రంగుల్ని ఇష్టంగా ధరించేవారు చాలా మందే ఉంటారు. ఆ అభిరుచి ఉన్నవాళ్ల కోసం నూలు వస్త్రంతో పెసర పచ్చ వన్నెలో రూపొందించిందే ఇక్కడ కనిపిస్తున్న స్కర్టు. లేత బ్రౌన్, మసక నారింజ రంగుల ప్రింట్లు దీనికి సొగసులద్దాయి. పువ్వులు, మామిడి పిందెలు, జామెట్రిక్ ఆకృతులు ఇందులో ఉన్నాయి. నడుము దగ్గర వెడల్పాటి పట్టీతో వచ్చిన దీనికి మ్యాచింగ్ టాప్‌తో జతచేస్తే.. నచ్చినప్పుడు ధరించేలా స్వచ్ఛమైన వన్నెల డ్రెస్ రెడీ!



• సమత చౌదరి, డిజైనర్
wowobySamathachowdari



స్టార్టప్ స్టోరీస్

Sandhya Jella

**ఫ్యాషన్ డిజైనింగ్, మోడలింగ్.. ఒకటేమిటి, కోరుకున్న శిఖరాలన్నీ చేరుకున్నారు సంధ్య జెల్లా. తన అనుభవానికి, అపార నైపుణ్యానికి చిటికెడు సృజన జోడించి గ్రూమింగ్ రంగంలో ప్రవేశించారు. విద్యార్థినులను ప్రొఫెషనల్స్‌గా, గృహిణులను ఆంత్రప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దారు. స్వాప్నికుల కార్ఖానా 'షీ గ్రూమింగ్' ఫౌండర్ సంధ్య స్టార్టప్ స్టోరీ ఈ వారం..**

# విజేతల కార్ఖానా!

**నేను** హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. సొంత కాళ్లపై నిలబడాలనే సంకల్పంతో ఈ స్థాయికి వచ్చాను. పాఠశాల దశలోనే ఒంటబట్టిన ఫ్యాషన్ డిజైనింగ్ స్కిల్స్ నలుగురిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. జీవితంలో ఎదురైన అనేకానేక సంఘటనలు నన్ను మరింత శక్తిమంతురాలిగా మార్చాయి. నాన్న ఏరోనాటికల్ ఇంజినీర్. సరిపడా పాకెట్ మనీ ఇచ్చేవారు. కానీ, సొంతంగా సంపాదించుకోవడంలోనే సంతృప్తి ఉందనిపించేది నాకు. దీంతో ఎంబీయే తర్వాత.. నాన్న నా పెళ్లి కోసం దాచిన డబ్బుతో 'శైవీ' పేరిట ఫ్యాషన్ డిజైనింగ్ స్టూడియో ప్రారంభించాను. కస్టమర్స్‌కు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కూకట్‌పల్లిలోని ఓ మాల్‌లో షోరూమ్ అద్దెకు తీసుకున్నాను. వ్యాపారం వేగంగా పుంజుకుంది. ఒకప్పుడు హేళన చేసినవారే నన్ను 'సక్సెస్‌ఫుల్ బిజినెస్ ఉమెన్'గా చూస్తున్నారు. ప్రశంసిస్తున్నారు.

### అనుకోకుండానే..

ఆహార్యం వ్యక్తిత్వాన్ని చాటుతుంది. ప్రపంచానికి మనమేమిటో చెబుతుంది. ఫ్యాషన్ డిజైనర్‌గా ఉన్నరోజుల్లో.. అనుకోకుండానే ఓ ఈవెంట్ నిర్వహించాల్సిన బాధ్యత నా నెత్తిన పడింది. అప్పుడు, నా బుర్రలో మెరిసిన ఆలోచనే మోడలింగ్ వైపు అడుగులు వేయించింది. నన్ను నేను మోడల్‌గా తీర్చిదిద్దుకున్నాను. 'ఇంప్రెస్ యూనివర్స్' సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 'మిస్ యూనివర్స్'గా నిలిచాను. అక్కడితో ఆగకుండా.. 'మిస్ గ్లోబల్ ఇండియా' పోటీలో పాల్గొనే స్థాయికి చేరుకున్నాను. ప్రతి మజిలీ కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. నాలోని ప్రత్యేకతలు నాకు తెలిసేలా చేసింది. బాలిలో జరిగిన మిస్ ఇండియా ఆసియా పసిఫిక్ పోటీలో ఏడో ఫైనలిస్ట్‌గా నిలబడటం ఆ ఆత్మవిశ్వాస ప్రభావమే.

### వినూత్నంగా..

ఫ్యాషన్ డిజైనర్‌గా ఉన్నప్పుడు, రెండు స్టోర్స్ ప్రారంభించాను. అక్కడితో ఆగకుండా.. ఏదైనా కొత్తగా చేయాలనే ఉద్దేశంతో 'షీ గ్రూమింగ్' వెంచర్ ఆరంభించాను.

> ఏ రంగంలోనైనా ఒడుదొడుకులు సహజం. నేను కూడా ఫ్యాషన్ డిజైనర్‌గా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. అవాంతరాలకు తట్టుకుని నిలబడినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతాం. లక్ష్యంపై ఫోకస్ చేసినప్పుడే గమ్యాన్ని ముద్దాడగలం. ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు.. నమ్మకమే సగం బలం.



సగటు మహిళను దృష్టిలోపెట్టుకుని డిజైన్ చేసిన వినూత్నమైన ప్రాజెక్ట్ ఇది. కుప్పలు తెప్పలుగా వస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ సంస్థలు, మోడలింగ్ కన్సల్టెన్సీలకు భిన్నంగా దీన్ని తీర్చిదిద్దాను. సాధారణ స్త్రీని సైతం.. అందం, ఆత్మవిశ్వాసానికి ప్రతినిధిగా నిలబెట్టాలనేది నా లక్ష్యం. ఫ్యాషన్ డిజైనింగ్‌తోపాటు, ఆంత్రప్రెన్యూర్‌షిప్ స్కిల్స్, అలంకరణ, మాటతీరు, సెల్ఫ్ డిఫెన్స్ నైపుణ్యాలు అందిస్తూ .. పరిపూర్ణ మహిళగా సానబడతాం. రెండేండ్ల కాలంలో రెండువేల మందికి కొత్త జీవితాన్ని ఇచ్చాం. గ్రూమింగ్ రంగానికి దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. లక్షలు పోస్తే కానీ ఆ సంస్థల్లో శిక్షణ తీసుకోలేరు. మా దగ్గర సగటు మహిళలకు కూడా ద్వారాలు తెరిచే ఉంటాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో గ్రూమింగ్ కరికులమ్ సిద్ధం చేశాను. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ పట్టభద్రులు కాలేజ్ క్యాంపస్ నుంచి కార్పొరేట్ ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు కావాల్సిన భాషా నైపుణ్యాలు, ఆహార్యం, అలంకరణపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. ఫిట్‌నెస్ పాఠాలూ చెబుతాం. సామాజిక బాధ్యతగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్స్ (కోవె) తరఫున అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. 'వాల్యూ ఎడ్యుకేషన్' అనే ఎన్జీవో రాయబారిగా నిరుపేద బాలికలకు గ్రూమింగ్ గురించి అవగాహన కల్పిస్తున్నా. ఆత్మవిశ్వాసం నింపుతున్నా. ఆర్థిక స్వేచ్ఛ అవసరాన్ని నొక్కి చెబుతున్నా. తన కాళ్ల మీద తాను నిలబడినప్పుడే.. మహిళ సగర్వంగా తలెత్తుకోగలదు. నన్ను కలిసిన ప్రతి యువతికి నేను ఇచ్చే సలహా కూడా ఇదే. ఏ దశలోనూ నిరాశపడవద్దు. ఏ పరిస్థితుల్లోనూ ఓటమిని ఒప్పుకోవద్దు.

... కడార్ల కిరణ్

చిన్న యాదగిరిగౌడ్

# అమ్మాయిలు.. అమ్మాయిలే!

**టీనేజ్** చాలా సంక్లిష్టమైన దశ. కానీ ఆ మలుపులో పిల్లల్ని అర్థం చేసుకునేదెవరు, మనోభావాలను పట్టించుకునేదెవరు? ఒకప్పుడైతే వయసు ఎలా వచ్చిందో, ఎలా వెళ్లిందో కూడా తెలియని పరిస్థితి. ఇప్పుడలా కాదు. పిల్లలు ఎన్నో చూస్తున్నారు, తెలుసుకుంటున్నారు. అన్నిటికీ మించి తమకేం కావాలనే స్పష్టత ఉంటున్నది. ఈ అంశాన్ని ఎత్తి చూపే చిత్రమే Girls Will Be Girls. ఆ ఇతివృత్తం నచ్చేసి.. నటి రిచా చద్దా నిర్మాతగా వ్యవహరించారు. ఎక్కువ శాతం మహిళలే పనిచేసిన ఈ చిత్రానికి శుచి తలాటి దర్శకురాలు. అమెరికాలో జరిగిన సండాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమా ఆడియన్స్ అవార్డు గెలుచుకొంది. నాయికగా నటించిన ప్రీతి పాణిగ్రాహి ప్రత్యేక పురస్కారాన్ని అందుకొన్నది. ఈ సందర్భంగా ప్రీతి గురించి చెప్పుకోవాల్సిందే. 22 ఏండ్ల ఈ యువతి.. పదహారేండ్ల అమ్మాయిలా నటించి మెప్పించింది. టీనేజర్ల ఉద్వేగాల గురించి బోల్డ్‌గా చర్చించిన ఈ చిత్రంలో నటించేందుకు మొదట్లో కాస్త ఇబ్బందిగా అనిపించిందట. అసలే తనకు వెండితెర కొత్త. పైగా సంప్రదాయ కుటుంబం. అయినా, వాస్తవ పరిస్థితులను కథ ప్రతిబింబిస్తున్నదనే అభిప్రాయంతో కుటుంబ సభ్యులు ప్రీతికి అండగా నిలిచారు. ప్రోత్సహించారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.






## నమస్తే తెలంగాణ

ముల్కనూరు ప్రజా గ్రంథాలయం వారి

## ముల్కనూరు సాహితీ పీఠం

[ముల్కనూరు, భీమదేవరపల్లి (మం), హనుమకొండ జిల్లా]

సంయుక్త నిర్వహణలో




### పోటీ ప్రధాన ఉద్దేశం

సంస్కృతి, చరిత్ర, సమకాలీన జీవన వైవిధ్యాల, వైరుధ్యాల నేపథ్యంలో కథ ఉండాలి. నవ్యతకు, సృజనాత్మకతకు పెద్దపీట వేసే కథలకు మాత్రమే ఆహ్వానం పలుకుతున్నాం.

పోటీకి వచ్చిన కథలలో ఉత్తమమైన కథలను ఎంపిక చేస్తాం.

బహుమతుల వివరాలు

బహుమతి పొందిన కథలు నమస్తే తెలంగాణ 'బతుకమ్మ'లో ప్రచురితం అవుతాయి.

పది కథలను సాధారణ ప్రచురణ కోసం స్వీకరిస్తాం. ఈ కథలకు వెయ్యి రూపాయలతోపాటు, జ్ఞాపికలు అందజేస్తాం.

బహుమతి పొందిన కథలను పుస్తక రూపంలో అచ్చు వేసే అధికారం పోటీ నిర్వాహకులకు ఉంటుంది.

ప్రథమ బహుమతి (ఒక్కరికి) రూ. 50,000

2 ద్వితీయ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 25,000

3 తృతీయ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 10,000

6 కన్సొలేషన్ బహుమతులు (ఒక్కొక్కరికి) రూ. 5,000

### నియమ నిబంధనలు

ఇంతకు ముందు ఎక్కడా (ప్రింట్ పత్రికలలో కానీ, వెబ్ పత్రికలలో కానీ, వ్యక్తిగత బ్లాగులలో కానీ, సోషల్ మీడియాలో కానీ) ప్రచురితం కాని కథలను మాత్రమే పోటీకి పంపాలి.

ఇప్పటికే ఎక్కడైనా పరిశీలనలో ఉన్న రచనలు పోటీకి అనర్హం.

పై అంశాలను ధృవీకరిస్తూ హామీపత్రం తప్పనిసరిగా జతపరచాలి.

ప్రచురణకు అంగీకరించని రాతప్రతులను తిరిగి పంపడం సాధ్యం కాదు.

ఒకరు ఒక కథను మాత్రమే పంపాలి.

రచనకు ఏ కలం పేరు వాడినా రచయిత / రచయిత్రి అసలు పేరు తప్పనిసరిగా హామీ పత్రంలో రాయాలి.

కథ అనువాదం, అనుకరణ, అనుసరణ కాదని హామీపత్రంలో స్పష్టం చేయాలి.

పోటీలో బహుమతి పొందిన ఏ కథనైనా, ఫలితాలు వెలువడిన తరువాత వెనక్కి తీసుకునే అవకాశం రచయితలకు లేదని గమనించగలరు.

బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. రచయితలకు ప్రాంతీయ భేదం లేదు. ఏ రాష్ట్రమైనా, ఏ దేశంలో ఉన్న తెలుగు వారైనా కథలు పంపవచ్చు.

### పంపాల్సిన విధానం

- రాత ప్రతి అయితే కథ 12 పేజీలు మించకుండా ఉండాలి. పదాల్లో అయితే 1500 పదాలకు మించకూడదు. ఈ పరిధిని దాటితే, పరిశీలనకు స్వీకరించబడవు.
- ఈ-మెయిల్ ద్వారా పంపేవారు యూనికోడ్‌లో వర్డ్‌ఫైల్ పంపవచ్చు. దాన్ని పీడీఎఫ్‌లోకి కూడా మార్చి ఎటాచ్ చేయాలి.
- పేజ్‌మేకర్‌లో డీటీపీ చేయించి కథను పంపేవారు యూనికోడ్ ఫైల్‌ను, పీడీఎఫ్‌ను కూడా జతచేసి ఆ రెండిటినీ ఈ-మెయిల్‌లో ఎటాచ్ చేసి పంపాలి.
- కథలను ఆన్‌లైన్‌లో పంపేవారు దిగువ తెలిపిన ఐడీకి మాత్రమే మెయిల్ చేయాలి.
- కథల ప్రతులపై రచయిత/రచయిత్రి పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంపై మాత్రమే పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ రాయాలి.

ముల్కనూరు లేదా హైదరాబాద్‌లో బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుంది.

కథల పోటీ ఫలితాలు 'నమస్తే తెలంగాణ' బతుకమ్మలో ప్రచురితం అవుతాయి.

కథలు మాకు అందాల్సిన చివరి తేదీ ఫిబ్రవరి 29, 2024

కథలు పంపాల్సిన చిరునామా

బతుకమ్మ కథలపోటీ, నమస్తే తెలంగాణ
# 8-2-603/1/7, 8, 9, రోడ్ నంబర్ 10,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034.
ఈ-మెయిల్ ఐడీ
ntmulkanoorkatha2024@gmail.com

## స్నేహం కోసం

**నా స్నేహితురాలి తండ్రి ఈ మధ్యే మరణించారు. ఆ విషాదం నుంచి తనింకా కోలుకోలేదు. ఇదే అవకాశం అన్నట్టు బంధుమిత్రులు ఆమెకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. తన మీద పెత్తనం చెలాయించాలని చూస్తున్నారు. ఈ సమయంలో ఓ మిత్రురాలిగా నేనేం చేయగలను, ఎలా సాయపడగలను?**

**• ఓ పాఠకురాలు**

**మీ** ఆలోచన అర్థమైంది. స్నేహితురాలి పట్ల మీ నిబద్ధతకు అభినందించి తీరాల్సిందే. నిజమే. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తండ్రిని కోల్పోవడం ఏ కూతురి జీవితంలో అయినా విషాదమే. అందులోనూ ఆమె పేరిట ఆస్తిపాస్తులు ఉన్నాయని చెబుతున్నారు కాబట్టి, బెల్లం చుట్టూ ఈగల్లా బంధుగణం చేరిపోవడం సహజమే. ఎమోషన్స్‌ను అడ్డం పెట్టుకుని ఎంతోకొంత లాభపడే ప్రయత్నమూ జరుగుతుంది. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండమని హెచ్చరించడం స్నేహితురాలిగా మీ బాధ్యత. ఇలాంటి సమయాల్లో ఎవరైనా కొంత ఏకాంతాన్ని కోరుకుంటారు. ఇంటి నిండా మనుషులు ఉన్నప్పుడు.. అసౌకర్యంగానూ ఉంటుంది. కాబట్టి, మీరు ఎక్కడున్నా, ఎంత దూరంలో ఉన్నా.. 'నేనున్నా' అనే భరోసా ఇవ్వగలిగితే చాలు.



డియర్ జిందగీ